కొత్త సీఎస్‌గా మురుగానందం

● బాధ్యతల స్వీకారం

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి ఎన్.మురుగానందం నియమితులయ్యారు. ఆదివారం రాత్రి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, సోమవారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా ఉన్న శివదాస్ మీనా రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్‌గా బదిలీ కావటంతో ఆయన స్థానంలో ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న మురుగానందంను ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం.. ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. 1991 ఐఏఎస్ బ్యాచ్‌కి చెందిన మురుగానందం చెన్నైకి చెందినవారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేశారు. తిరునల్వేలి సబ్‌కలెక్టర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించారు. గత అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఆయన పారిశ్రామికశాఖ కార్యదర్శిగా, రవాణా శాఖ, నగరాభివృద్ధి శాఖ కార్యదర్శిగా సేవలందించారు. 2021లో డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆయన్ని ఆర్థికశాఖ కార్యదర్శిగా నియమించింది.



సచివాలయంలో ముఖ్యమంత్రి స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఎన్.మురుగానందం

బీజేపీతో రహస్యంగా పొత్తా..! ఆ అవసరం మాకులేదు

● ఈపీఎస్‌కు సీఎం స్టాలిన్ కౌంటర్

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): బీజేపీతో రహస్యంగా పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం డీఎంకేకి లేదని ఆ పార్టీ అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రతిపక్షనేతకు కౌంటర్ ఇచ్చారు. సోమవారం ఉదయం జరిగిన తిరువొత్తియూరు ఎమ్మెల్యే కేపీ శంకర్ కుమారుడు దిలీపన్ వివాహ వేడుకలకు సహచర మంత్రులతో హాజరై నూతన వధూవరులను సీఎం ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకలు యేడాదిపొడవునా నిర్వహించడం చూసి ఓర్వలేని ఈపీఎస్ ఆదివారం జరిగిన శతజయంతి స్మారక నాణెం ఆవిష్కరణపై బురద జల్లే విధంగా విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. నాణేల ఆవిష్కరణ సభ ఎవరు నిర్వహిస్తారనే విషయం కూడా ప్రతిపక్షనేతకు తెలియకపోవటం విచారకరమని, కేంద్రప్రభుత్వం ముద్రించే నాణేలపై హిందీ, ఆంగ్ల భాషల్లోనే అక్షరాలుంటాయని కూడా తెలియకపోవడం ఆయన అవివేకాన్ని బట్టబయలుచేస్తోందన్నారు. కరుణ రూపంతో ముద్రించిన నాణేం ఆవిష్కరణ సభ పూర్తిగా కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోనే జరిగిందని, నాణేల ఆవిష్కరణ సభలు కేంద్రమే నిర్వహిస్తుందని, అందుకే ఆ సభకు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్య అతిథిగా ఆహ్వానించామన్నారు. పావుగంటసేపు సభలో పాల్గొంటే చాలునని రాజ్‌నాథ్‌సింగ్‌కు ముందే చెప్పానని, అందుకాయన ఎన్నిగంటలపాటైనా సభలో ఉంటానని ప్రకటించి తనకు సంతోషం కలిగించారన్నారు. కరుణానిధి కోసం రాజ్‌నాథ్‌సింగ్ విశ్లేషణాత్మకంగా డీఎంకే నేతలు కూడా మాట్లాడనంతగా మాట్లాడి నివాళులర్పించటం తనకు ఆశ్చర్యం కలిగించిందన్నారు. రాజ్‌నాథ్ సింగ్ ముక్తసరిగా మూడు మాటలతో తన ప్రసంగాన్ని ముగించి ఉండవచ్చునని, అయితే దివంగత నేత కరుణానిధి జాతీయ నాయకులందరికీ బాగా సుపరిచితుడు కనుకనే సుదీర్ఘంగా ప్రసంగించారని చెప్పారు. ఇదంతా చూసి ప్రతిపక్షనేత ఈపీఎస్‌కు కంటగింపుగా మారిందని, కరుణ నాణెంలో హిందీ అక్షరాలున్నాయని, ఇప్పుడెలా హిందీని అనుమతించారంటూ యెద్దేవా చేయటం విడ్డూరంగా ఉందని అన్నారు. అన్నాదురై, ఎంజీఆర్ వంటి నాయకులకు కూడా నాణేలు ముద్రించారని, అందులో కూడా హిందీ అక్షరాలున్న విషయాన్ని ఈపీఎస్ గమనించలేదనే విషయం తనకు అవగతమవుతోందని ఎద్దేవా చేశారు. కరుణానిధి స్మారక నాణెంలో తన కోరిక మేరకు 'తమిళ్‌వెల్లుమ్' (తమిళభాషకు జయం) అని తమిళంలో ముద్రించడానికి కేంద్రం అంగీకరించడం తనకెంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కరుణ స్మారక నాణెం ఆవిష్కరణ సభకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఏర్పాట్లు మాత్రమే చేపట్టిందని, ఈ వాస్తవాలు తెలియక ఆ సభ పూర్తిగా డీఎంకే ఆధ్వర్యంలో జరిగినట్లు ఈపీఎస్ విమర్శలు చే స్తు న్నా ర ని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజీఆర్ ఫొటోతో ముద్రించిన నాణేన్ని ఈపీఎస్ మాత్రమే ఆవిష్కరించారని, ఆ నాణేన్ని ఆవిష్కరించడానికి కేంద్ర ప్రభుత్వం నుంచి ఎవరూ రాలేదన్నారు. ఇక జయలలితకు తామే విశ్వాసపాత్రులమంటూ గొప్పలు చెప్పుకుంటున్న ఈపీఎస్ ఆమె మృతి చెందిన తర్వాత పార్టీ ఆధ్వర్యంలో సంతాపసభలు కూడా నిర్వహించలేదన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని, అలాంటి వ్యక్తికి కరుణ నాణెం ఆవిష్కరణ సభ గురించి విమర్శించే అర్హతలేదన్నారు. నాణెం ఆవిష్కరణకు కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఆహ్వానించినంత మాత్రాన బీజేపీతో డీఎంకే రహస్యంగా పొత్తు కుదుర్చుకున్నారంటూ ఈపీఎస్ విమర్శలు చేయడం గర్హనీయమని స్టాలిన్ పేర్కొన్నారు. ఈపీఎస్‌లా మోకాళ్లానుకుంటూ, జోగాడుతూ వెళ్ళి ఒకరి పాదాలపై పడి పదవులు పొంది ప్రతీకారం తీర్చుకునే గుణం డీఎంకేకు ఎన్నడూ లేదని తేల్చి చెప్పారు. డీఎంకే సిద్ధాంతాలకు ఎన్నడూ కట్టుబడి ఉంటామని, రాష్ట్ర హక్కులను ఎల్లప్పుడూ కాపాడుకుంటామని, ఈ విషయంలో వెనుకంజ వేసే ప్రసక్తే లేదని స్టాలిన్ అన్నారు.


వధూవరులకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంకే స్టాలిన్


రక్షాబంధన్ సందర్భంగా గవర్నర్ ఆర్ఎన్ రవికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేస్తున్న బ్రహ్మకుమారీలు

ఆకస్మికంగా ఢిల్లీ వెళ్లిన గవర్నర్ రవి

ప్యారీస్, ఆగస్టు 19: రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి సోమవారం సాయంత్రం అత్యవసరంగా ఢిల్లీ వెళ్లారు. ఆదివారం రాత్రి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఢిల్లీ వెళ్లిన నేపథ్యంలో, ఎలాంటి ప్రకటన లేకుండా గవర్నర్ ఢిల్లీ ఆకస్మిక పయనం చర్చనీయాంశమైంది. గవర్నర్ ఆర్ఎన్ రవి పదవీకాలం జూలై 31వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, ఆయన పదవీకాలాన్ని రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము పొడిగిస్తారని అందరూ ఎదురుచూశారు. అయితే, రాష్ట్రపతి భవన్ నుంచి గవర్నర్ పదవీకాలం పొడిగింపు, అదే సమయంలో తమిళనాడుకు కొత్త గవర్నర్ నియామకంపై ఉత్తర్వులు రాకపోవడంతో గవర్నర్ అలాగే కొనసాగుతున్నారు. ఇదిలా ఉండగా, తన పదవీకాలం ముగియడంతో ఈ నెల 1వ తేది గవర్నర్ ఆర్ఎన్ రవి ఢిల్లీ వెళ్లారు. అక్కడ మూడు రోజులు కేంద్ర మంత్రులతో సమావేశమై 4వ తేది నగరానికి తిరిగొచ్చారు. తాను గవర్నర్ పదవిలో కొనసాగేందుకు ప్రధాని నరేంద్ర మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షా తదితరులను కలిసి అడిగేందుకు సోమవారం సాయంత్రం నగరం నుంచి ఢిల్లీ వెళ్లారు. 21వ తేది సాయంత్రం నగరానికి తిరిగొస్తారని రాజ్‌భవన్ వర్గాలు తెలిపాయి. ఢిల్లీ వెళ్లే ముందు రాజ్‌భవన్‌లో బ్రహ్మకుమారీలు రక్షాబంధన్ సందర్భంగా ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు.

గిరిప్రదక్షిణకు పోటెత్తిన భక్తులు

పెరంబూర్, ఆగస్టు 19: పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణకు వచ్చిన భక్తులతో తిరువణ్ణామలై కిటికిటలాడింది. తిరువణ్ణామలైలో ప్రపంచ ప్రసిద్ధి చెందిన అరుణాచలేశ్వర స్వామి ఆలయ వెనుక భాగంలో 'అన్నామలై' అని భక్తులు పిలుచుకొనే కొండ చుట్టూ 14 కి.మీ మేర గిరి ప్రదక్షిణ చేసేందుకు పౌర్ణమి రోజున లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ఆ ప్రకారం, ఈ నెల పౌర్ణమి ఘడియలు సోమవారం వేకువజామున 3 గంటలకు ప్రారంభమయ్యాయి. ఆ సమయంలో గిరి ప్రదక్షిణ చేసేందుకు రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్ర, కర్ణాటక, కేరళ, తెలంగాణ సహా పలు రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. వేకువజామున 4 గంటలకు ఆలయాన్ని తెరచి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. సుమారు 2 కి.మీ మేర క్యూలైన్లలో భక్తులు వేచి ఉంది స్వామి దర్శనం చేసుకున్నారు.


గిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులు

రేపటి నుంచి మెడికల్ కౌన్సెలింగ్

● ఆరోగ్య మంత్రి సుబ్రమణ్యం
● ర్యాంకుల జాబితా విడుదల
● విల్లుపురం రజనీష్‌కు ఫస్ట్‌ర్యాంక్


గిండి ఆసుపత్రి ప్రాంగణంలో మెడికల్ కౌన్సెలింగ్ ర్యాంకర్ల జాబితా విడుదల చేస్తున్న ఆరోగ్యశాఖ మంత్రి సుబ్రమణ్యం

చెన్నై, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించి జనరల్ కేటగిరి అభ్యర్థులకు ఆగస్టు 21న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం ప్రకటించారు. గిండిలో సోమవారం ఉదయం ఆయన ఈ అడ్మిషన్లకు సంబంధించి నీట్ లో అత్యధిక మార్కులు సాధించిన ర్యాంకర్ల జాబితాను విడుదల చేశారు. ఆ జాబితా ప్రకారం ప్రభుత్వ కోటాలో నీట్‌లో 720 మార్కులు పొందిన విల్లుపురానికి చెందిన ఎస్సీ విద్యార్థి పి.రజనీష్‌కు ఫస్ట్‌ర్యాంక్ లభించింది. రజనీష్ తనకు నచ్చిన కళాశాలలో ఎంబీబీఎస్ కోర్సులో చేరవచ్చని మంత్రి చెప్పారు. ఇదేవిధంగా అన్నానగర్‌కు చెందిన సయ్యద్ ఆర్రిన్ యూసఫ్ రెండో ర్యాంక్, కోడంబాక్కంకు చెందిన శైలజ మూడో ర్యాంక్, రామనాథపురం విద్యార్థి పి.శ్రీరామ్ నాలుగో ర్యాంక్, తిరువన్నామలైకి చెందిన జయంతి పూర్వజ ఐదో ర్యాంక్, తిరుచెంగోడు విద్యార్థి ఆర్.రోహిత్ ఆరో ర్యాంక్, మోగనూరు విద్యార్థి శబరీశన్ ఏడో ర్యాంక్, చెన్నై పెరవళ్లూరుకు చెందిన విద్యార్థిని రోషిణీ సుబ్రమణియం ఎనిమిదో ర్యాంక్, నామక్కల్‌కు చెందిన ఎంజే విఘ్నేష్, కోయంబత్తూరుకు చెందిన విజయకృత్తిక శశికుమార్ పదో ర్యాంక్ సాధించారని ఆయన వివరించారు.

7.5 % రిజర్వేషన్లలో టాప్‌టెన్ ర్యాంకర్లు...: రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 7.5 శాతం రిజర్వేషన్ల ప్రకారం కృష్ణగిరికి చెందిన రూపిక ఫస్ట్ ర్యాంక్, సేలంకు చెందిన గాయత్రీదేవి రెండో ర్యాంక్, అనుసియా మూడో ర్యాంక్, రతీష్ నాలుగో ర్యాంక్, అన్బరసు ఐదో ర్యాంక్, పూజా ఆరో ర్యాంక్, మహాలక్ష్మి ఏడో ర్యాంక్, మణిశంకర్ ఎనిమిదో ర్యాంక్, మోనికా తొమ్మిదో ర్యాంక్, నందగోకుల్ 10వ ర్యాంక్ సాధించినట్టు మంత్రి సుబ్రమణ్యం తెలిపారు. వైద్యకోర్సుల్లో ప్రవేశానికి గత యేడాదికంటే ఈ యేడాది 272 మంది అధికంగా మొత్తం 43,063 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారని, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అంతర్గత రిజర్వేషన్ ప్రకారం 3733 మంది, స్పోర్ట్స్ కేటగిరీలో 343 మంది, మాజీ సైనికుల కోటా లో 455మంది, దివ్యాంగుల కేటగిరి కింద 133 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ యేడాది మొత్తం సీట్లు 6630, గతేడాది కంటే అదనంగా 150 సీట్లు పెంచామని చెప్పారు. బీడీఎస్ కోర్సులకు సంబంధించి 1683 సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని ఆయన చెప్పారు. ప్రభుత్వం కల్పించే 7.5 శాతం రిజర్వేషన్ ప్రకారం ప్రభుత్వ, స్వయం ప్రతిపత్తి కళాశాలలో 496 సీట్లున్నాయని, బీడీఎస్ కోర్సులకు 126 సీట్లున్నాయని మంత్రి వెల్లడించారు.

నగదు అక్రమ బట్వాడా కేసు

● సీబీఐ కోర్టుకు ఎంపీ రాజా

ప్యారీస్, ఆగస్టు 19: అక్రమ నగదు బట్వాడాకు పాల్పడ్డారనే ఆరోపణలపై నమోదైన కేసులో డీఎంకే ఎంపీ ఎ.రాజా సోమవారం ఉదయం నగరంలోని సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. కేంద్ర మాజీ మంత్రి, నీలగిరి ఎంపీ రాజా ఆదాయానికి మించి ఆస్తులు పోగుచేసుకున్నారంటూ 2015వ సంవత్సరంలో సీబీఐ అయనపై కేసు నమోదుచేసింది. ఈ కేసులో 2022వ సంవత్సరం నగరంలో ఎంపీ, ఎమ్మెల్యేలపై నమోదైన కేసుల విచారణ జరిపే ప్రత్యేక కోర్టులో సీబీఐ ఛార్జీషీటు దాఖలుచేసింది. అందులో... ఆరోపణలు ఎదుర్కొంటున్న రాజా ఆదాయానికి మించి రూ.5.53 కోట్లు ఆస్తులు కూడబెట్టుకున్నారని సీబీఐ పేర్కొంది. ఈ కేసు ఆధారంగా రాజా మిత్రుడు కృష్ణమూర్తి, ఎన్.రమేష్, విజయ్ సటరంగని, కోవై షెల్ టవర్స్ ప్రమోటర్స్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్, మంగల్ టెక్ పార్క్ లిమిటెడ్ సంస్థలకు సంబంధాలున్నాయంటూ కేసు నమోదు చేశారు. ఈ కేసు మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో ఉన్న సీబీఐ ప్రత్యేక కోర్టులో న్యాయమూర్తి ఎస్.ఎళిల్‌వేలన్ సమక్షంలో సోమవారం విచారణకు రాగా, రాజాతో పాటు పలువురు హాజరయ్యారు. ఈ కేసు తదుపరి విచారణ సెప్టెంబరు 18వ తేదీకి వాయిదావేశారు. ఇదిలా ఉండగా, తదుపరి విచారణకు హాజరుపై మినహాయింపు కోరుతూ రాజా తరఫున దాఖలైన పిటిషన్‌కు వివరణ ఇవ్వాల్సిందిగా ఈడీకి న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది.



మతవాద శక్తులతో సీఎం స్టాలిన్ రాజీపడరు

● టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై

పెరంబూర్, ఆగస్టు 19: మతవాద శక్తులతో ముఖ్యమంత్రి స్టాలిన్ రాజీపడరని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ (టీఎన్‌సీసీ) అధ్యక్షుడు సెల్వపెరుందగై అన్నారు. టీఎన్‌సీసీ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షులు ఎస్.సత్యమూర్తి 137వ జయంతి సోమవారం నిర్వహించారు. రిప్పన్ భవనం ప్రాంగణంలోని సత్యమూర్తి విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సెల్వపెరుందగై మీడియాతో మాట్లాడుతూ... కరుణానిధి శతజయంతి సందర్భంగా 100 రూపాయల నాణేం ఆవిష్కరణ ప్రభుత్వ కార్యక్రమమన్నారు. కాంగ్రెస్ ఎంపీ, రాహుల్ గాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు కూడా ఈ కార్యక్రమాన్ని స్వాగతించారన్నారు. కార్యక్రమ ఏర్పాటుపై కాంగ్రెస్‌కు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. రాష్ట్రంలో కామరాజర్ తర్వాత ప్రజల కోసం ఎన్నో పథకాలు అమలచేసిన వ్యక్తి కరుణానిధి అన్నారు. ఉదయ పవర్ స్కీమ్, నీట్ , జీఎస్టీ వంటివి అనుమతించింది అన్నాడీఎంకే ప్రభుత్వమన్నారు. అందుకోసం రాష్ట్ర సంక్షేమాన్ని ఆ పార్టీ విస్మరించిందని ఆరోపించారు. కానీ, రాష్ట్ర సంక్షేమాన్ని వదులుకొని కేంద్ర ప్రభుత్వం ఏ పథకం అమలుచేయ తలపెట్టినా సీఎం స్టాలిన్ సంతకం పెట్టలేదని తెలిపారు. గతంలో కరుణానిధి గురించి హీనంగా మాట్లాడిన వారు నేడు వేదిక పైకి వచ్చి ఆయనను అభినందిస్తూ మాట్లాడడం హర్షనీయమన్నారు. అలాగే, ఎన్నికల ప్రచారంలో డీఎంకే, కరుణానిధిపై చేసిన దుష్పచారాన్ని బీజేపీ వెనక్కి తీసుకోవాలని సెల్వ పెరుందగై డిమాండ్ చేశారు.


రిప్పన్ భవనం ప్రాంగణంలోని సత్యమూర్తి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సెల్వ పెరుందగై

తప్పుడు సర్టిఫికెట్ల వ్యవహారం

1000 మంది ప్రొఫెసర్లపై చర్యలు ? ● అన్నా వర్సిటీ సిండికేట్ నిర్ణయం

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తప్పుడు సర్టిఫికెట్లతో ఒకే సమయంలో రెండుమూడు కళాశాలల్లో పనిచేసి మోసానికి పాల్పడిన 1000 మంది ప్రొఫెసర్లపై చర్యలు చేపట్టేందుకు అన్నా యూనివర్సిటీ పాలకమండలి సిద్ధమవుతోంది. ఒకే సమయంలో పలు ఇంజనీరింగ్ కళాశాలల్లో తప్పుడు సర్టిఫికెట్లు సమర్పించి ప్రొఫెసర్లుగా నియామకం పొంది మోసగించిన వ్యవహారాన్ని 'అరప్పోర్ ఇయక్కమ్' అనే సామాజిక సంస్థ బట్టబయలు చేసిన విషయం తెలిసిందే. దీంతో అన్నా విశ్వవిద్యాలయం విచారణ జరిపింది. మొదట సుమారు 300 మంది ఇలాంటి మోసాలకు పాల్పడినట్లు వెల్లడైంది. ఆ తర్వాత ఆ సంఖ్య 676కు పెరిగింది. ఆ విచారణలో ఓ అధ్యాపకుడు 22 కళాశాలల్లో పనిచేస్తూ వేతనాలు పొందనట్లు కూడా బహిర్గతమైంది. ప్రతియేటా ఇదేవిధంగా అధ్యాపకులు మోసాలకు పాల్పడినట్లు గుర్తించారు. 20 మంది 10కి పైగా కళాశాలల్లో వేతనాలు పొంది మోసాలకు పాల్పడినట్లు తెలుసుకున్నారు. ఈ మోసాలకు పాల్పడిన ప్రొఫెసర్లపైనే కాకుండా వారిని నియమించుకున్న కళాశాల యాజమాన్యాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని సిండికేట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల జరిగిన ఆ సమావేశంలో అధికారులు కీలకమైన తీర్మానాలు ప్రతిపాదించి ఆమోదింపజేశారు. గత వారం అందిన సమాచారం ప్రకారం 1000 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఈ మోసాలకు పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది. వారు రాష్ట్రంలో ఏ కళాశాలలో పని చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సిండికేట్ సమావేశం తీర్మానించింది. ఈ మోసాలకు అండగా నిలిచిన ఇంజనీరింగ్ కళాశాలలపై కూడా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించింది. ఇదిలా ఉండగా ఇప్పటికే ఈ మోసాలకు అండగా నిలిచిన 295 కళాశాలలకు అన్నా విశ్వవిద్యాలయం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ నోటీసులకు బదులివ్వడానికి మరింత గడువు కావాలంటూ ఆయా కళాశాలలు అన్నా విశ్వవిద్యాలయానికి విజ్ఞప్తిచేశాయి. సిండికేట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం మోసాలకు పాల్పడిన 1000 మంది ప్రొఫెసర్లపై అన్నా విశ్వవిద్యాలయంలో త్వరలో కఠిన చర్యలు తీసుకోనుంది. ఈ ప్రొఫెసర్లు రాష్ట్రంలో ఏ కళాశాలలోనూ పనిచేయకుండా కఠిన చర్యలు చేపట్టే అవకాశముందని వర్సిటీ వర్గాలు చెబుతున్నాయి.



సమాచార ధ్వని

ఉప వైద్య కోర్సుల ర్యాంకుల జాబితా విడుదల

పెరంబూర్, ఆగస్టు 19: రాష్ట్రంలో బీఎస్సీ నర్సింగ్, బి.ఫార్మ్, బీపీటీ సహా 19 రకాల ఉప వైద్య కోర్సుల అడ్మిషన్లకు సంబంధించిన ర్యాంకుల జాబితా సోమవారం విడుదలైంది. ఈ కోర్సులకు మొత్తం 68,108 మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 67,038 మందితో కూడిన ర్యాంకుల జాబితా www.tnmedicalselection.net, tnhealth.tn.gov.in అనే వెబ్‌సైట్లలో విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

తగ్గిన పవన విద్యుదుత్పత్తి

ఐసిఎఫ్, ఆగస్టు 19: రాష్ట్రంలో ఈ ఏడాది గాలి వేగం తగ్గడంతో 92 కోట్ల యూనిట్ల పవన విద్యుదుత్పత్తి తగ్గింది. రాష్ట్రంలో 9,100 మెగావాట్ల సామర్థ్యంతో పవన విద్యుత్ కేంద్రాలున్నాయి. మే నుంచి సెప్టెంబరు వరకు సీజన్‌లో ప్రతిరోజు 8 నుంచి 10 కోట్ల యూనిట్లు ఉత్పత్తి జరుగుతోంది. ఈ సీజన్‌లో సరిపడేంత గాలి వేగం లేకపోవడంతో మే నుంచి ఈ నెల 16వ తేది వరకు విండ్ మిల్లుల నుంచి 626 కోట్ల యూనిట్ల విద్యుదుద్పత్తి మాత్రమే జరిగింది. గత ఏడాది ఇదే సమయంలో 718 కోట్ల యూనిట్ల ఉత్పత్తి జరిగింది.

నకిలీ మెసేజ్‌లు నమ్మొద్దు: విద్యుత్ బోర్డు

ఐసిఎఫ్, ఆగస్టు 19: విద్యుత్ బిల్లులకు సంబంధించి నకిలీ మెసేజ్‌లు నమ్మి మోసపోవద్దని ఆ శాఖ అధికారులు హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యుత్ బిల్లులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా, ఆన్‌లైన్‌లో చెల్లించే వారి సంఖ్య పెరుగుతోంది. కొందరు మోసగాళ్లు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. ఇటీవల విద్యుత్ వినియోగదారులకు 'మీ పాత విద్యుత్ బిల్లు సరిచేయకపోవడంతో మీ విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తాం... సమస్య పరిష్కారానికి ఈ యాప్ వినియోగించాలంటూ' నకిలీ మెసేజ్‌లు వస్తున్నాయి. దీనిని గుర్తించిన విద్యుత్ బోర్డు అధికారులు, ఇలాంటి నకిలీ మెసేజ్‌లు నమ్మి మోసపోవద్దని వినియోగదారులను హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, ఆగస్టు 19: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **పుళల్:** బాలాజీ గార్డన్, పుదునగర్, బైపాస్ రోడ్డు 5,6 వీధులు, దర్గాస్ రోడ్డు **సిరుచ్చేరి:** షోలింగనల్లూర్, ఎల్కాట్ అవెన్యూ రోడ్డు, మోడల్ స్కూల్ రోడ్డు, నెడుంజెళియన్ వీధి, నారాయణస్వామి వీధి, పడవట్టమ్మన్ ఆలయ వీధి, పరమేశ్వరన్ నగర్, పొన్నియమ్మన్ ఆలయ వీధి, కుమరన్ నగర్, టీఎన్‌హెచ్‌బీ కాలని, అలమేడు మంగాపురం, గాంధీ నగర్, రాజీవ్ గాంధీ రోడ్డు, నూకంపాళయం రోడ్డు, తిరువళ్లువర్ నగర్, సెమ్మంజేరి, జవహర్ నగర్, సత్యభామ కళాశాల, సెయింట్ జోసఫ్ కళాశాల, విలేజ్ హైరోడ్డు, వేలునాయకర్ వీధి, నెహ్రూ వీధి, గణేశ్ నగర్, మేడవాక్కం రోడ్డు, విప్రో రోడ్డు, అన్నా వీధి, దేవరాజ్ నగర్, న్యూ కుమరన్ నగర్, ఎళిల్ నగర్, గాంధీ వీధి, ఎంజీఆర్ వీధి మడిపాక్కం: షీలా నగర్, అన్నై థెరిస్సా నగర్, సదాశివం నగర్, గోవిందస్వామి నగర్, రాజాజీ నగర్, రామ్ నగర్ సౌత్, కుబేరన్ నగర్, మహాలక్ష్మి నగర్, రామ్ నగర్ నార్త్, రాజరాజేశ్వరి నగర్, భజన ఆలయ వీధి, పెరియార్ నగర్, కులకరై వీధి, అన్నా నగర్, రాజ్యలక్ష్మి నగర్. **అళ్వార్‌పేట:** టీటీకే రోడ్డు 1వ క్రాస్ వీధి, భీమన్న మొదలి 1,2 వీధులు, సీపీ రామన్ రోడ్డు, సీపీ రామస్వామి వీధి, భీమన్న గార్డన్ రోడ్డు, బావ రోడ్డు, ఆనంద్ రోడ్డు, రంగా రోడ్డు, ఆనందపురం, అశోక వీధి, లక్ష్మీ కాలని, సుందరరాజన్ వీధి, సుబ్రమణ్యం వీధి, కన్ని ఆలయ పల్లం, కన్ని ఆలయమేడు, విశాలాక్షి గార్డన్, సుబ్బరాయన్ రోడ్డు, నరసింహ పురం, సెయింట్ మేరీస్ రోడ్డు, ఆర్‌ఏ పురం, వీకే అయ్యర్ రోడ్డు, శ్రీనివాస రోడ్డు, వారన్ రోడ్డు, వెంకటేశ్వర అగ్రహారం, మాడ వీధి, జెట్ నగర్ 1 నుంచి 3 వీధులు, టీవీ పేట వీధి, వినాయకం వీధి, వీసీ గార్డన్ 1 నుంచి 3 వీధులు, ట్రస్ట్‌పాక్కం నార్త్, సౌత్ రోడ్లు, జేజే రోడ్డు, ఎల్డామ్స్ రోడ్డు, శ్రీమాన్ శ్రీనివాస వీధి, మురేశ్ గేట్ రోడ్డు, పార్థసారథి వీధి, అళ్లార్‌పేట ప్రధాన వీధి, పెరుమాళ్ ఆలయ వీధి.

నిషేధిత ప్రాంతానికి వచ్చిన విద్యార్థులకు జరిమానా

ఐసిఎఫ్, ఆగస్టు 19: నిషేధిత అటవీ ప్రాంతంలోకి వచ్చిన విద్యార్థులకు ఆ శాఖ అధికారులు రూ.14 వేలు జరిమానా విధించారు. దిండుగల్ జిల్లా కొడైకెనాల్ నగరానికి సమీపంలో కరడిసోలై అటవీ ప్రాంతం ఉంది. అక్కడున్న జలపాతాల సందర్శనకు అధికారులు నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో, ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థులు 14 మంది ఆదివారం కొడైకెనాల్ వచ్చారు. వారు నిషేధిత కరడిసోలై అటవీ ప్రాంతంలో ప్రవేశించి ఫొటోలు తీసుకున్నారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు నిషేధ ప్రాంతంలోకి ప్రవేశించినందుకు 14 మంది విద్యార్థులకు తలా రూ.1,000 చొప్పున జరిమానా విధించారు.

35 కాటేజీల కూల్చివేతకు నోటీసులు

ఐసిఎఫ్, ఆగస్టు 19: ఏనుగుల సంచార మార్గంలో నిర్మించిన 35 కాటేజీలను కూల్చివేయాలని అధికారులు నోటీసులు జారీచేశారు. ముదుమలై పులుల అభయారణ్యం మసినకుడి ప్రాంతంలో ఏనుగులు తిరిగే మార్గంలో 309 గదులతో 35 కాటేజీలు నిర్మించారు. వీటిని కూల్చివేయాలని కోర్టు ఇదివరకే ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకు కూల్చివేయకపోవడంతో 15 రోజుల్లోగా వాటిని కూల్చివేయకపోతే కఠిన చర్యలు చేపడతామని కాటేజీల యజమానులకు జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీచేసింది.

8న రేషన్ ఉద్యోగుల సమ్మె

పెరంబూర్, ఆగస్టు 19: సమస్యల పరిష్కారం కోరుతూ సెప్టెంబరు 8వ తేది సమ్మె చేపట్టనున్నట్లు రాష్ట్ర రేషన్ ఉద్యోగుల సంఘం ప్రకటించింది. బ్యాంకు ద్వారా వేతనం సహా 10 కోర్కెలతో అన్ని జిల్లాల్లో చేపట్టనున్న సమ్మెలో, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 35,000 రేషన్ దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పాల్గొంటారని ఆ సంఘం ఒక ప్రకటనలో తెలిపింది..

ఆలయ కొలనులో ఆక్రమణలు తొలగించండి

పెరంబూర్, ఆగస్టు 19: కుంభకోణం ఆలయ కొలనులో వెలసిన ఆక్రమణలు తొలగించని పక్షంలో ఈ నెల 28వ తేది కలెక్టర్ నేరుగా హాజరుకావాల్సి ఉంటుందని హైకోర్టు హెచ్చరించింది. న్యాయవాది యానై రాజేంద్రన్ మద్రాసు హైకోర్టులో కోర్టు ఉల్లంఘనపై పిటిషన్ వేశారు. 2018లో కుంభకోణం ఆలయ కొలను ఆక్రమించిన చేపట్టిన కట్టడాలు తొలగించాలని జారీచేసిన ఉత్తర్వులు నేటి వరకు అమలుకాలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు.

ఎస్‌ఐపై దాడి చేసి పరారీయత్నం

● రౌడీని తుపాకీతో కాల్చి అరెస్టు చేసిన పోలీసులు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లాలో పేరుమోసిన రౌడీ సెల్వంపై పోలీసులు కాల్పులు జరిపి అరెస్టు చేశారు. ఎస్‌ఐపై వేటకొడవలితో దాడి చేసి పారిపోయేందుకు ప్రయత్నించడంతో కాల్పులు జరిపి అతడిని బంధించినట్లు పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. కన్నియాకుమారి జిల్లా కరుంబాట్టూరు ప్రాంతానికి చెందిన రౌడీ సెల్వంపై 6 హత్యకేసులు, హత్యాయత్నం, దారి దోపిడీలు సహా 27 రకాల కేసులున్నాయని, దీంతో అతడిని అరెస్టు చేయడానికి పోలీసులు రంగంలోకి దిగారు. సోమవారం వేకువజామున సుశీంద్రం సమీపంలో సెల్వం దాగి ఉన్నట్లు సమాచారం అందటంతో సీఐ ఆదమ్‌అలీ, ఎస్‌ఐ లిపి పాల్‌రాజ్, కానిస్టేబుళ్లు హుటాహుటిన అక్కడికి వెళ్ళి అతడిని చుట్టుముట్టారు. సెల్వం వెంటనే ఎస్‌ఐ పాల్‌రాజ్‌పై వేటకొడవలితో దాడి చేసి పారిపోయేందుకు ప్రయత్నించడంతో సీఐ అలీ తుపాకీతో కాల్పులు జరిపారు. ఈ సంఘటనలో కుడికాలిలో తూటా దూసుకెళ్లటంతో రౌడీ సెల్వం కుప్పకూలిపడ్డాడు. పోలీసులు అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఎస్‌ఐ పాల్‌రాజ్ కూడా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుకుంటున్నారు.



తుపాకీ కాల్పుల్లో గాయపడిన రౌడీ సెల్వంను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

సమాజ శ్రేయస్సు కోసం కృషిచేద్దాం

● బిషప్ దేవదాస్ పాత్ర



ఎస్‌సీసీఎఫ్ సమావేశంలో బిషప్ దేవదాస్ పాత్ర, బిషప్ ఎం.పద్మారావు తదితరులు

ప్యారీస్, ఆగస్టు 19: క్రైస్తవ బోధకులు సమాజ శ్రేయస్సు కోసం కృషిచేయాలని దక్షిణ భారత మెట్రోలిటన్ బిషప్ డా.దేవదాస్ పాత్ర పిలుపునిచ్చారు. స్థానిక విల్లివాక్కంలోని సేఫ్ ఇండియా కార్యాలయంలో సోమవారం ఉదయం నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ఫెలోషిప్ (ఎన్‌సీసీపీ) జాతీయ సమావేశం దేవదాస్ పాత్ర అధ్యక్షతన జరిగింది. తెలంగాణా బిషప్ ఎం.పద్మారావు, రెవ.డేవిడ్ ఆంటోని, రెవ.లాజర్, రెవ.జయరావు, రెవ.శాంతకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేవదాస్ పాత్ర మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలకు హరియాణాలో ప్రభుత్వ ఉద్యోగాల్లో 20 శాతం రిజర్వేషన్ కల్పించడానికి సీఎం నయాబ్‌సింగ్ సైనీ నేతృత్వంలోని మంత్రి వర్గం ఆమోదం తెలిపిందన్నారు. అదే విధంగా తమిళనాడులో కూడా కల్పించాలని డిమాండ్ చేశారు. సెప్టెంబరు 16న నగరంలో నిర్వహించనున్న పీస్ ర్యాలీలో 1,000 మందికి పైగా పాస్టర్లు, బోధకులు పాల్గొంటారని ఆయన తెలిపారు.

విజయకరిశల్‌కుళంలో మట్టిదీపాలు లభ్యం



లభ్యమైన మట్టిదీపం

ఐసిఎఫ్, ఆగస్టు 19: విరుదునగర్ జిల్లా విజయకరిశల్‌కుళంలో చేపట్టిన తవ్వకాల్లో మట్టిదీపాలు, ముద్రలు, రాతి బంతి వంటివి లభించాయి. మూడో విడత తవ్వకాల్లో ఇప్పటి వరకు పగిలిన మట్టి బొమ్మలు, చదరంగం పావులు సహా 1,300లకు పైగా వస్తువులు లభ్యమయ్యాయి. ఎక్కువగా ప్రాచీన కాలం నాటి ఎర్రటి రాళ్లు, కుండ పెంకులు కనుగొన్నారు. ఈ నేపథ్యంలో, బంకమట్టితో చేసిన అలంకరణ దీపాలు, ముద్రలు, రాతి బంతులు, ఇతర ఉపకరణాలు లభించాయి. వీటి కాలం నిర్ధారించేందుకు పంపినట్లు పురావస్తు పరిశోధకులు తెలిపారు.

ఊరేగింపుగా సారె తెచ్చిన మేనమామలు



ఊరేగింపుగా సారె తెస్తున్న దృశ్యం

ఐసిఎఫ్, ఆగస్టు 19: బాలుడి కర్ణాభరణ వేడుకలకు మేనమామలు గుర్రపు బగ్గీ, ట్రాక్టర్లపై సారె తెచ్చిన సంఘటన స్థానికులను ఆశ్చర్య పరిచింది. దిండుగల్ జిల్లా ఆత్తూర్ తాలూకా దాడికొంబు ప్రాంతానికి చెందిన శబరిపాండి-షర్మిల దంపతులకు సిద్దేష్ అనే కుమారుడున్నాడు. ఈ బాలుడి చెవులు కుట్టే వేడుకలు ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం జరిగాయి. మేనమామలు బాణాసంచా పేల్చుతూ మేళతాళాలతో చేరట్ వాహనం, ట్రాక్టర్లపై బియ్యం బస్తాలు, వివిధ రకాల పండ్లు, అరటి గెలలు, చాక్లెట్లు, కొత్త దుస్తులు, ఆటబొమ్మలు, పొట్టేలు మొత్తం 1,008 సామాన్లతో తరలివచ్చారు. అదే సమయంలో బాలుడి అత్త కొడుకులు కూడా ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లపై మేళతాళాలతో సారె తీసుకొచ్చారు.

మెదడు నిర్జీవమైన వ్యక్తి అవయవదానం



వేలు (ఫైల్‌ఫొటో)

వేలూరు, ఆగస్టు 19: మెదడు నిర్జీవమైన వ్యక్తి తన అవయవాల ద్వారా మరికొందరికి ప్రాణదానం చేశారు. తిరువణ్ణామలై జిల్లా కోటకొట్టాయి ప్రాంతానికి చెందిన వేలు (45) ఈ నెల 16వ తేది కారులో వస్తుండగా ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సీఎంసీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అదే రోజు రాత్రి ఆయన మెదడు నిర్జీవమైందని వైద్యులు గుర్తించారు. వైద్యుల సూచనలతో ఆయన అవయవాలు దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకరించారు. దీంతో, ప్రత్యేక శస్త్రచికిత్స ద్వారా వెలికితీసిన గుండె, ఊపిరితిత్తులు చెన్నై ఎంజీఎం ఆసుపత్రి, ఎడమ కిడ్నీ రాణిపేట సీఎంసీ క్యాంప్‌నకు, కుడి కిడ్నీ చెన్నై రేలాఆస్పత్రి, నేత్రాలు చెన్నై కావేరి ఆస్పత్రికి తరలించారు. వేలుకు చిత్ర అనే భార్య, గౌతమ్ అనే కుమారుడు, గౌతమి అనే కుమార్తె ఉన్నారని బంధువులు తెలిపారు.

ఉద్యోగాల పేరుతో రూ.94 లక్షల మోసం

● సచివాలయంలో క్యాంటీన్ నడిపిన వ్యక్తి అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 19: ఉద్యోగాలు, ఇళ్లు ఇప్పిస్తామని నమ్మించి పలువురి వద్ద రూ.94.50 లక్షలు మోసాం చేసిన వ్యక్తిని నగర పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక అంబత్తూర్ రామాపురం తిరువళ్లువర్ వీధికి చెందిన రాజ్‌కుమార్ (50) ఖతార్‌లో ఉన్న ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఆయన భార్య రేణుకా దేవి, తన పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగం, ఇళ్లు ఇప్పించాలని సచివాలయ ప్రాంగణంలో క్యాంటీన్ నడుపుతున్న కార్తికేయన్‌ను ఆశ్రయించారు. ఆమె తొలివిడతగా తమ బంధువులు, దివ్యాంగులకు ప్రభుత్వ ఉద్యోగాల కోసం రూ.3 లక్షలు కార్తికేయన్‌కు అందజేశారు. ఆ తర్వాత అన్నానగర్‌లో ఉన్న రూ. కోటి విలువైన అపార్ట్‌మెంట్ భవనాన్ని రూ.70 లక్షలకే ఇప్పిస్తానని నమ్మించడంతో, ఆ మాటలు నమ్మిన ఆమె కార్తికేయన్ బ్యాంక్ ఖాతాకు రూ.94.50 లక్షలు జమచేశారు. రోజులు గడిచినా అతని నుంచి ఎలాంటి సమాచారం లేకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదుచేసింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపి కేసు నమోదుచేసి పోలీసులు, కార్తికేయన్‌ను అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపరచి పూందమల్లి జైలుకు తరలించారు.

రోగుల నుంచి లంచం

● నర్సుకు మెమో జారీ

అడయార్, ఆగస్టు 19: తంజావూరు జిల్లా పట్టుకోట ప్రభుత్వ ఆస్పత్రిలో రోగుల దగ్గర లంచంతీసుకుటున్న వ్యవహారంలో ఆ ఆస్పత్రిలో పనిచేసే నర్సుకు ఆస్పత్రి చీఫ్ డాక్టర్ మీనా మెమో జారీ చేశారు. ఈ ఆస్పత్రిలో 30 మంది వైద్యులు, 60 మంది నర్సులు, ముగ్గురు నర్స్ సూపరింటెండెంట్లు, ఇతర వైద్య సిబ్బది పనిచేస్తున్నారు. ఇక్కడ 25 యేళ్ళుగా పనిచేస్తున్న షీలా అనే నర్సు.. గత మార్చిలో నర్సు సూపరింటెండెంట్‌గా పదోన్నతి పొందారు. ఈ నెల 15వ తేదీన జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ నర్సు అవార్డు కూడా పొందారు. అలాంటి నర్సు.. రోగుల నుంచి లంచం తీసుకున్నట్టుగా వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అయింది. దీంతో ఆస్పత్రి చీఫ్ డాక్టర్ మీనా విచారణకు ఆదేశించడంతో పాటు షీలాకు మెమో జారీచేశారు. విచారణ తర్వాత పూర్తి వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

ఊటీ ప్రభుత్వాస్పత్రిలో పోలీసుల తనిఖీలు

ఐసిఎఫ్, ఆగస్టు 19: ఊటీలోని ప్రభుత్వాస్పత్రుల్లో పోలీసు అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం కోల్‌కతాలో వైద్య విద్యార్థిని హత్యాచారానికి గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సీబీఐ అధికారులు కేసు నమోదుచేసి కొందరిని అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు. వైద్యురాలి హత్యకు న్యాయం చేకూర్చాలని కోరుతూ దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళనలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల్లో ఆస్పత్రులు, వైద్యకళాశాలల్లో తనిఖీలు నిర్వహించి భద్రతా ఏర్పాట్లు పటిష్టం చేయాలని డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు.ఆఉత్తర్వుల మేరకు ఊటీ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో ఎస్పీ నిషా ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఇదే విధంగా కున్నూర్ ప్రభుత్వాసుపత్రిలో కూడా తనిఖీలు జరిగాయి.

వైద్యుల డిమాండ్లు సత్వరం పరిష్కరించాలి

● శరత్ కుమార్

పెరంబూర్,ఆగస్టు19: ప్రజలకు సేవలందించే వైద్యులకు తగిన భద్రత కల్పించేందుకు సత్వరం చర్యలు చేపట్టాలని నటుడు శరత్ కుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం విడుదల చేసిన ప్రకటనలో... ఆరోగ్యవంతమైన సమాజం కోసం వైద్యుల సేవలు ఎంతో అవసరమన్నారు. వైద్యులు, నర్సులు, సిబ్బందికి సీసీ టీవీ తగిన భద్రతా అంశాలు, వారికి మౌలిక వసతుల కల్పన తదితరాలు సత్వరం చేపట్టాలని శరత్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

వాల్పారై-పొల్లాచ్చి రోడ్డులో చిరుత సంచారం



ఘాట్ రోడ్డులో సంచరిస్తున్న చిరుత

పెరంబూర్, ఆగస్టు 19: వాల్పారై-పొల్లార్చి రోడ్డులో రాత్రి వేళల్లో చిరుత సంచరిస్తుండడంతో వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని అటవీ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. కోవై జిల్లా వాల్పారై సమీపంలో అడవి జంతువుల సంచారం రోజురోజుకు అధికమవుతోంది. కొద్దిరోజులుగా ఈ ప్రాంతంలో చిరుత సంచరిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆదివారం రాత్రి వాల్పారై-పొల్లాచ్చి రోడ్డు అయర్‌బాడి ప్రాంతం లో రోడ్డుపై చిరుత సంచరించే దృశ్యాలతో కూడిన వీడియోలు వైరల్‌గా మారాయి. రాత్రి వేళల్లో ఈ మార్గంగా వెళ్లే వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

విశ్వకర్మ స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో ఆవణి ఆవట్టమ్



ఆవణి ఆవట్టమ్ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

వేలూరు, ఆగస్టు 19: తమిళనాడు విశ్వకర్మ స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆవణి ఆవట్టమ్ వేడుకలు ఘనంగా జరిగాయి. బేరిపేట గాంధీ రోడ్డు కేవీఎస్ శెట్టి వీధిలోని బ్రహ్మం గారి మఠంలో ఈ వేడుకలు జరిగాయి. కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు తేజోమూర్తి అధ్యక్షత వహించగా, స్థాపకుడు, సెక్రటరీ జనార్ధనన్ ఆహ్వానం పలికారు. ఆర్గనైజర్ నటరాజన్, ఉపాధ్యక్షులు పన్నీర్‌సెల్వం, అన్నామలై, జ్ఞానసంబంధన్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ అర్చకులు కుప్పుస్వామి ఆచారి, కుప్పన్ ఆచారి బృందం వేద మంత్రాల నడుమ యజ్ఞోపవీత ధారణ కార్యక్రమం జరిగింది. ఈ వేడుకల్లో విశ్వకర్మ గ్రూప్ అధ్యక్షులు అన్బరసు, ఉప సెక్రటరీ స్వామినాథన్, జాయింట్ సెక్రటరీ సెల్వరాజ్, కార్యకర్తల కమిటీ సభ్యులు జగదీశన్, జయప్రకాశ్, కార్తికేయన్ సహా సుమారు 200 మంది పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో 245 వినతులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, ఆగస్టు 19: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ జరిగింది. కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. కొత్త రేషన్ కార్డులు, పట్టా మార్పిడి, ఇళ్ల పట్టాలు, కుల ధ్రువీకరణ పత్రాలు, స్వయం ఉపాధి సంఘాలకు రుణాలు సహా పలు సమస్యలపై 245 వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి మాలతి, మహిళా పథక డైరెక్టర్ నాగరాజన్, జిల్లా ఎస్సీ, ఎస్టీ సంక్షేమ అధికారి సీత, పౌరసరఫరాల శాఖ అధికారి సుమతి సహా పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసు....

ఆర్కాడ్ సురేష్ భార్య అరెస్టు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): గత నెలలో జరిగిన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆమ్‌స్ట్రాంగ్ హత్యకేసులో నిందితురాలైన రౌడీ ఆర్కాడ్ సురేష్ భార్య పొర్కొడిని సీబీసీఐడీ అరెస్టు చేసింది. ఆమ్‌స్ట్రాంగ్ హత్య తర్వాత నెల రోజులుగాపైగా పరారీలో ఉన్న ఆమెను ఆదివారం ఆంధ్రా సరిహద్దులో అరెస్టు చేసి తీసుకువచ్చారు. సోమవారం కోర్టులో ఆమెను హాజరుపరచగా మేజిస్ట్రేట్ సెప్టెంబర్ రెండు వరకూ జ్యుడిషియల్ కస్టడీ విధించారు. గత యేడాది పట్టినంబాక్కంలో జరిగిన ఆర్కాట్ సురేష్ హత్య కేసు నిందితులకు మద్దతుగా ఆమ్‌స్ట్రాంగ్ వ్యవహరించాడనే కక్షతోనే అతడి తమ్ముడు పొన్నై బాలు, అతడి వదిన పొర్కొడితో కలిసి హత్యకు కుట్రపన్నినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.

చెన్నై ఎయిర్‌పోర్టులో నక్షత్ర తాబేళ్ల స్వాధీనం

● రూ.37 లక్షల ఈ-సిగరెట్లు కూడా

అడయార్, ఆగస్టు 19: చెన్నై నుంచి మలేసియాకు అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 780 నక్షత్ర తాబేళ్లతో పాటు రూ.37 లక్షల విలువైన ఈ-సిగరెట్లను ఎయిర్‌పోర్టు భద్రతా సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. చెన్నై నుంచి కౌలాలంపూర్ వెళ్లే ఇండిగో ఎయిర్‌లైన్స్ విమానంలో భద్రతా అధికారులు ఆకస్మిక తనిఖీలు చేశారు. రామనాథపురం జిల్లాకు చెందిన ఇబ్రహీం, యూసుఫ్, అష్రాఫ్ పర్యాటకులుగా వెళ్తున్నారు. వారి దగ్గరున్న పెద్ద పెద్ద అట్ట బాక్సులను తనిఖీ చేయగా, అందులోల నక్షత్ర తాబేళ్లను గుర్తించి, వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆ ముగ్గురు ప్రయాణికుల లగేజీ కూడా తనిఖీ చేయగా అందులో రూ.37 లక్షల విలువ చేసే ఈ-సిగరెట్లు ఉన్నాయి. వాటిని కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఈ ముగ్గురు ప్రయాణాన్ని రద్దు చేసిన అధికారులు.. వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. స్వాధీనం చేసుకున్న నక్షత్ర తాబేళ్ల విలువ రూ.15 లక్షలకు వరకు ఉంటుందని అధికారులు అధికారులు తెలిపారు.



చెన్నై వళ్లువర్‌కోట్టం సమీపంలో సమస్యల సాధన కోసం ఆందోళన చేపట్టిన విద్యుత్ బోర్డు గాంగ్‌మెన్లకు సంఘీభావం తెలుపుతున్న డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్



చెన్నై కొరట్టూరు పోలీసుస్టేషన్‌లో రక్షాబంధన్ సందర్భంగా పోలీసులకు రాఖీ కడుతున్న భక్తవత్సలం పాఠశాల విద్యార్థినులు

చెట్టుపై రెండంతస్తుల ఇల్లు



చెట్టుపై నిర్మించిన ఇల్లు

ఐసిఎఫ్, ఆగస్టు 19: తిరుప్పూర్ జిల్లా ఉడుమలై సమీపంలోని ఆండిపట్టి రాయర్‌పాళయంలో రైతు కుటుంబానికి చెందిన ఐదుగురు చెట్టుపై రెండంతస్తుల ఇల్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. ఉడుమలై పరిశోధకులు శివకుమార్, కరుణానిధిలతో కూడిన బృందం కొలుమమ్ ప్రాంతంలోని పశ్చిమ కనుమల్లో పరిశోధనలు చేస్తుండగా, ఓ చెట్టుపై ఇంటిని గమనించారు. అందులో పెరుమాళ్, ఆయన కుటుంబ సభ్యులు నివసిస్తున్నారు. ఈ విషయమై పరిశోధకులు కరుణానిధి మాట్లాడుతూ... ఇక్కడున్న రైతులు జొన్న, మొక్కజొన్న, ఉలవలు వంటివి సాగుచేస్తున్నారని, వీటి కోసం ఏనుగులు, అడవి పందులు వస్తుండడంతో, వాటి నుంచి పంటలు రక్షించుకొనేందుకు భారీవృక్షాలు ఎంపిక చేసి ఇల్లు నిర్మించుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో, పెరుమాళ్ అనే వ్యక్తి చెట్టుపై ఇల్లు నిర్మించుకున్నారని, కింది అంతస్తులో వంట గది, పై అంతస్తులో బెడ్ రూమ్ ఇలా రెండు భాగాలుగా విభజించుకున్నారని తెలిపారు.

విద్యుదాఘాతంతో ఏనుగు మృతి

ఐసిఎఫ్, ఆగస్టు 19: విరుదునగర్ జిల్లా శ్రీవిల్లిపుత్తూర్ సెంబగతోపు సమీపంలో విద్యుదాఘాతానికి ఏనుగు మృతిచెందింది.సెంబగతోపు అటవీ ప్రాంతం నుంచి ఏనుగుల మంద విరియన్‌కోవిల్ రాకాసి అమ్మన్ ఆలయ ప్రాంతానికి ఆదివారం వచ్చాయి. వాటిలో ఓ ఏనుగు కొబ్బరి తోటలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా, తోట భద్రత కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ తీగ తగిలి విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. మృతిచెందిన ఏనుగుకు 25 సంవత్సరాలుంటాయని, పోస్టుమార్టం నిర్వహించి దంతాలు తొలగించి సమీపంలోని అడవిలో పూడ్చిపెట్టామని, అనుమతి లేకుండా విద్యుత్ కంచె ఏర్పాటుచేసిన తోట యజమాని దురైపాండిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

ఇంట్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

పెరంబూర్, ఆగస్టు 19: స్థానిక అభిరామపురంలో ఇంట్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యవహారంలో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. అభిరామపురం పోలీసులకు అందిన సమాచారంతో ఆదివారం రాజా అన్నామలైపురం గ్రీన్‌వేస్ రోడ్డులోని ఓ ఇంట్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. అక్కడ చట్టవ్యతిరేకంగా మద్యం విక్రయిస్తున్న మదన్, దినేష్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి 81 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

బైకును ఢీకొన్న బస్సు: దంపతుల మృతి



దామోదరన్, జయదుర్గా (ఫైల్‌ఫొటో)

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేలంబాక్కం వద్ద సోమవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి చెందారు. తాంబరం సమీపం మాడంబాక్కం శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన దామోదరన్ (50), జయదుర్గ (45) దంపతులు పదేళ్లుగా మహాబలిపురంలో అద్దె ఇంటిలో నివసిస్తున్నారు. దామోదరన్ మున్సిపాలిటీలో, జయ దుర్గా ఓ పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరిద్దరూ ప్రతి శని, ఆదివారాల్లో మాడంబాక్కంలో ఉన్న కుమార్తె ఇంటికి వెళ్ళి రెండు రోజులు అక్కడే ఉండి సోమవారం మహాబలిపురానికి తిరిగి వస్తుంటారు. ఆ మేరకు గత శనివారం ఈ దంపతులు కుమార్తె ఇంటికి వెళ్ళారు. సోమవారం వేకువ జాము బైకులో మహాబలిపురానికి బయలుదేరారు. కేలంబాక్కం సమీపం సోనాలూరు వద్ద వెనుకవైపు వచ్చిన ప్రైవేటు సంస్థకు చెందిన బస్సు బైకును ఢీకొంది. దీనితో ఆ దంపతులు రోడ్డుపై పడి ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రైవేటు బస్సు ఆగకుండా వెళ్లిపోయింది. కాసేపయ్యాక ఆ దారిలో వెళుతున్న పాదచారులు రక్తపుమడుగులో పడిఉన్న మృతదేహాలను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించారు. ఈ ప్రమాదానికి కారణమైన బస్ డ్రైవర్ కోటీశ్వరన్ (26)ను అరెస్టు చేశారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల మృతి



ఘటనలో నుజ్జునుజ్జయిన కారు

పెరంబూర్, ఆగస్టు 19: విల్లుపురం జిల్లా దిండివనం బైపాస్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీ, కుమారుడు మృతిచెందారు. స్థానిక గిండీకి చెందిన రత్నస్వామి సేలంలోని సిద్ధవైద్య ఆస్పత్రిలో చికిత్స పొంది, తన పెద్దకుమార్ వేల్‌మురుగన్, చిన్న కుమారుడు రమేష్ తదితరులతో కలిసి చెన్నై బయల్దేరాడు. దిండివనం బైపాస్ రోడ్డు సమీపం నత్తమేడు ప్రాంతంలో అదుపుతప్పిన కారు రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జుకాగా, తీవ్రగాయాలతో రత్నస్వామి, రమేష్ సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న విల్లుపురం పోలీసులు అక్కడకు చేరుకొని, కారు నడుపుతున్న వేల్‌మురుగన్‌ను ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

కారును లారీ ఢీకొని ఒకరి మృతి



ప్రమాదంలో ధ్వంసమైన కారు, బోల్తాపడిన లారీ

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): తిరుప్పూరు జిల్లా పల్లడం సమీపం తిరుచ్చి - కోయంబత్తూరు జాతీయ రహదారిలో సోమవారం ఉదయం సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. నామక్కల్ జిల్లా తిరుచెంగోడు మల్లైనగర్ ప్రాంతానికి చెదిన సతీష్ సోమవారం ఉదయం కారులో పొల్లాచ్చికి బయలుదేరాడు. అదే సమయంలో కేరళ నుంచి ప్లైవుడ్ లోడుతో ఓ లారీ కాంగేయానికి బయలుదేరింది. అజయ్ అనే డ్రైవర్ నడుపుతున్న లారీ పల్లడం సమీపం పొంగలూరు వద్ద అదుపు తప్పి కారును ఢీకొంది. అదే సమయంలో ముందువైపు చక్రం విడిపోవటంతో లారీ బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో కారు నడిపిన సతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం పల్లడం ఆసుపత్రికి తరలించగా, అక్కడ మృతిచెందారు. లారీ డ్రైవర్ అజయ్ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదం కారణంగా తిరుచ్చి - కోయబత్తూరు రహదారిలో గంటకు పైగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

ఆనమలై నల్లారు పథకం అమలుచేస్తాం

● ఈపీఎస్



ఈపీఎస్‌కు రాఖీ కడుతున్న రాజస్తాన్ మహిళలు

ప్యారీస్, ఆగస్టు 19: తాము అధికారం చేపడితే ఆనమలై నల్లారు పథకం అమలుచేస్తామని ప్రతిపక్షనేత, అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి పేర్కొన్నారు. అడయార్ గ్రీన్‌వేస్ రోడ్డులోని నివాసంలో ఈపీఎస్‌నకు సోమవారం రక్షాబంధన్ సందర్భంగా రాజస్తాన్ అసోసియేషన్‌కు చెందిన మహిళలు రాఖీ కట్టారు. వారికి శుభాకాంక్షలు తెలిపిన ఈపీఎస్ మీడియాతో మాట్లాడుతూ... దక్షిణాది జిల్లాల రైతుల దీర్ఘకాల కోరిక అనమలై నల్లారు నీటి ప్రాజెక్టును అమలుపరచాలనే ఆశయంతో మాజీ మంత్రులు ఎస్పీ వేలుమణి, పొల్లాచ్చి జయరామన్ తదితరులు కేరళ ముఖ్యమంత్రితో చర్చించారని తెలిపారు. అయితే, 2021లో అధికారం చేపట్టిన డీఎంకే పాలకులు ఈ పథకాన్ని అటకెక్కించారని, రైతులకు లబ్ధిచేకూర్చే ఈ పథకాన్ని అమలుపరచాలని కోరుతూ పలు పోరాటాలు కూడా నిర్వహించారని తెలిపారు. మళ్లీ అన్నాడీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని అమలుచేసి అన్నదాతలను సంతోషపరుస్తామని ఈపీఎస్ పేర్కొన్నారు.



'సర్దార్-2'లో రజీషా విజయన్

కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో 2022లో వచ్చిన 'సర్దార్' చిత్రానికి రెండో భాగం తెరకెక్కుతోంది. ఇందులో మలయాళ భామ రజీషా విజయన్‌ను ఒక హీరోయిన్‌గా ఎంపిక చేశారు. ఈ విషయాన్ని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. 'సర్దార్'లో హీరో కార్తీ ద్విపాత్రాభినయం చేశారు. తొలి భాగంలో రాశీఖన్నా, లైలా నటించారు. అయితే, రెండో భాగంగా రాశీఖన్నా, లైలా స్థానంలో కొత్తవారిని తీసుకోవాలని దర్శక నిర్మాతలు నిర్ణయించారు. ఇందులో భాగంగానే రజీషా విజయన్‌ను ఒక హీరోయిన్‌గా ఎంపిక చేయగా, ఇప్పటికే మరో ఇద్దరు హీరోయిన్లుగా మాళవిక మోహనన్, ఆషికా రంగనాథ్ ఎంపిక చేసిన విషయం తెల్సిందే. ప్రిన్స్ పిక్చర్స్ పతాకంపై నిర్మించే ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం సమకూర్చుతున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటుంది.

చిత్రజ్యోతి

ఈ విజయం సినీ ప్రయాణంలో ఓ మెట్టు

● హీరో ప్రశాంత్



ప్రశాంత్, ప్రియా ఆనంద్

'అంధగన్' మూవీ విజయం తన సినీ ప్రయాణంలో ఓ మెట్టని ఆ చిత్ర హీరో ప్రశాంత్ అన్నారు. తన తండ్రి, దర్శక నిర్మాత త్యాగరాజన్ డైరెక్షన్‌లో ప్రశాంత్ కథానాయకుడిగా నటించిన 'అంధగన్' ఈ నెల 15వ తేదీన విడుదలై విజయం సాధించింది. ఈ సక్సెస్ వేడుకలు తాజాగా జరిగాయి. ఇందులో ప్రశాంత్ మాట్లాడుతూ, 'ఈ సినిమా విజయం నా సినీ ప్రయాణంలో ఓ మెట్టు. మున్ముందు అనేక చిత్రాల్లో నటించాలని ఉంది. ప్రేక్షకులు, అభిమానులు ఎల్లవేళలా ప్రేమాభిమానాలు చూపించాలి. నా ఎదుగుదలకు సహకరించిన నిర్మాతలు, దర్శకులు, సహ నటీనటులు, నటీమణులకు ప్రతి ఒక్కరికీ ఈ సందర్భంగా ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను అన్నారు. సినిమా ప్రమోషన్ కోసం సహకరించిన అనిరుధ్ రవిచంద్రన్, ప్రభుదేవా, విజయ్‌లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. గతంలో సిమ్రన్‌తో కలిసి నటించిన సినిమాలన్నీ హిట్. ఇపుడు కూడా సక్సెస్ సాధించింది. మా ఇద్దరి కాంబినేషన్ ఎన్నటికీ సూపర్‌హిట్టే. ఈ సినిమా లొకేషన్‌లోనే కాకుండా, షూటింగ్ ముగిసిన తర్వాత కూడా తన ఎదుగుదలకు శ్రద్ధచూపుతున్న హీరోయిన్ ప్రియా ఆనంద్‌కు ప్రశాంత్ ధన్యవాదాలు' తెలిపారు. దర్శకుడు త్యాగరాజన్ మాట్లాడుతూ, 'అంధగన్' చిత్రం విజయంలో కీలక పాత్ర పోషించిన మీడియాకు ధన్యవాదాలు. ప్రియా ఆనంద్ నటన సహజత్వానికి దగ్గరగా ఉంది. ప్రశాంత్ హీరో అయినప్పటికీ ప్రతి పాత్ర సమానంగా డిజైన్ చేశాను. నిజానికి ఈ సినిమాకు మోహన్ రాజా దర్శకత్వం వహించాల్సి ఉంది. ఆయనకు చిరంజీవి చిత్రంలో అవకాశం వచ్చింది. దీంతో తానే దర్శకత్వ బాధ్యతలు చేపట్టాను. లోకేషన్‌లో సీనియర్ దర్శకుడు కేఎస్ రవికుమార్ సహాయ సహకారాలకు ధన్యవాదాలు. టాలీవుడ్‌లో తారస్థాయిలో ఉన్న సముద్రఖని అడిగిన వెంటనే డేట్స్ ఇచ్చి తన పాత్రకు న్యాయం చేశారు. ఇలా ఈ సినిమాలో నటించిన ప్రతి ఒక్కరూ సినిమా నిర్మాణంలోనూ, సక్సెస్‌లోనూ పాలు పంచుకున్నారన్న త్యాగరాజన్ వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

హీరో లేకుండానే షూటింగ్

ప్రేమ్ ఆనంద్ దర్శకత్వంలో ప్రముఖ హాస్య నటుడు సంతానం నటించిన 'డిడి రిటర్న్స్' సినిమా రెండోభాగం షూటింగ్ హీరో లేకుండానే శరవేగంగా సాగుతోంది. గత యేడాది వచ్చిన తొలిభాగాన్ని ప్రేక్షకులు ఆదరించడంతో వాణిజ్యపరంగా సక్సెస్ సాధించింది. ఇపుడు రెండో భాగాన్ని తెరకెక్కిస్తున్నారు. హీరో ఆర్య తన సొంత బ్యానరుపై నిర్మిస్తున్నారు. అయితే, ఈ ప్రాజెక్టు గురించి ఎలాంటి ప్రకటన లేకుండా గుట్టుచప్పుడు కాకుండా షూటింగ్ రెండు వారాలుగా నగరంలోని గోకులం స్టూడియోలో జరుగుతోంది. ఈ సినిమా కోసం ఈ స్టూడియోలో భారీ సెట్ వేసి అందులో చిత్రీకరిస్తున్నారు. అయితే, హీరో లేని సన్నివేశాలను షూట్ చేస్తున్నారు. దీంతో హీరో సంతానం లేకుండా ఈ సినిమా షూటింగ్ జరుగుతుందనే ప్రచారం సాగుతుంది. కాగా, కొన్నేళ్ళ క్రితం రాంబాలా దర్శకత్వంలో సంతానం నటించిన చిత్రం 'దిల్లుక్కు దుడ్డు'. ఈ సినిమా ఒకటి, రెండు భాగాలు వచ్చాయి. ఈ చిత్రం మూడో భాగాన్ని 'డిడి రిటర్న్స్' పేరుతో రాంబాలా శిష్యుడు ప్రేమ్ ఆనంద్ రూపొందించిన విషయం తెల్సిందే.



'డిడి రిటర్న్స్'లో సంతానం

దేశంలోనే ద్వితీయ అత్యుత్తమ వర్సిటీ వీఐటీ

● షాంఘై అకడమిక్ ర్యాంకుల్లో వెల్లడి



డాక్టర్ జి.విశ్వనాథన్

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): షాంఘై అకడమిక్ ర్యాంకుల్లో భారతదేశంలోనే రెండవ అత్యుత్తమ విశ్వవిద్యాలయంగా వీఐటీ నిలిచింది. షాంఘై విద్యా సంస్థల ర్యాంకులు ప్రపంచ వ్యాప్తంగా ప్రచురింపబడ్డాయి. ఈ సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా అత్యుత్తమ విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్ జాబితాను ప్రచురించింది. ఇందులో వీఐటీ వర్సిటీ దేశంలోనే ద్వితీయ స్థానంలో నిలిచింది. అలాగే దేశంలోని ప్రైవేటు యూనివర్సిటీల్లో వీఐటీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రపంచ విశ్వవిద్యాలయ ర్యాంకుల్లో 600లకు గాను వీఐటీ 501వ స్థానంలో నిలిచింది. కాగా షాంఘై అకాడమీ ప్రపంచంలోని 1000 విశ్వవిద్యాలయాల జాబితా ప్రచురించగా, ఇందులో భారత్ నుంచి కేవలం 15 విశ్వవిద్యాలయాలు మాత్రమే చోటు దక్కించుకున్నాయి. విద్య, పరిశోధనా కార్యకలాపాల ఆధారంగా షాంఘై అకడమిక్ ర్యాంకుల జాబితా ప్రకటిస్తుంది. నోబెల్ విజేతలతో పూర్వవిద్యార్థులు, ప్రొఫెసర్లు, టాప్ జర్నల్స్‌లో అగ్ర పరిశోధనా పత్రాల ప్రచురణ, అగ్ర పరిశోధనా ప్రచురణలు తదితరాల ఆధారంగా ర్యాంకులను ఖరారు చేస్తుంది.

అక్టోబరు 10న వస్తున్న 'వేట్టయాన్'




'వేట్టయాన్'లో రజనీకాంత్


అభిమానులు ఎపుడెపుడా అని ఎదురు చూస్తున్న సూపర్‌స్టార్ రజనీకాంత్ నటించిన కొత్త చిత్రం 'వేట్టయాన్' అక్టోబరు 10వ తేదీ విడుదల కాబోతుంది. ఈ విషయాన్ని నిర్మాణ సంస్థ సోమవారం అధికారికంగా ప్రకటించింది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి టీజే జ్ఞానవేల్ దర్శకుడు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రంలో రజనీకాంత్ పాత్రకు సంబంధించిన షూటింగ్ ఎపుడో పూర్తయింది. ఇతర నటీనటుల కొన్ని సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. వాస్తవ సంఘటనల ఆధారంగా అల్లుకున్న కథతో క్రైమ్ యాక్షన్ డ్రామాగా ఈ చిత్రం రానుంది. ఈ సినిమాలో అమితాబ్ బచ్చన్, ఫహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికా సింగ్, దుషార విజయన్, రోహిణి, అభిరామి ప్రధాన పాత్రలు పోషించడంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'పేట', 'దర్బార్', 'జైలర్' సినిమాల తర్వాత రజనీకాంత్ - రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ కాంబినేషన్‌లో వస్తున్న నాలుగో సినిమా కూడా ఇదేకావడం గమనార్హం.

ఏడు దశాబ్దాల 'భవానీసాగర్'

● మూడు జిల్లాలకు జీవనాడి



అప్పటి మద్రాసు ముఖ్యమంత్రి కామరాజర్ ప్రారంభించినప్పటి శిలాఫలకం



భవానీ సాగర్ డ్యాం

పెరంబూర్, ఆగస్టు 19: మూడు జిల్లాలకు జీవనాడిగా ఉన్న ఈరోడ్ జిల్లా భవానీసాగర్ డ్యాం సోమవారం 70వ వసంతలోకి అడుగిడింది. రాష్ట్రంలో తంజావూరు డెల్టా సాగు తర్వాత అతిపెద్ద నీటిపారుదల ప్రాంతంగా, దక్షిణ భారతదేశంలో అతిపెద్ద మట్టి ఆనకట్టగా భవానీసాగర్ డ్యాం పేరుగాంచింది. ఈరోడ్, తిరుప్పూర్, కరూర్ జిల్లాల్లో సుమారు 2.47 లక్షల ఎకరాల్లో ఈ డ్యాం కింద సాగులో ఉన్నాయి. ఆనకట్టు పొడవు 8.78 కి.మీ, ఆనకట్ట మొత్తం ఎత్తు 105 అడుగులు.

ఇంగ్లాండ్ నుంచి యంత్రాలు..

భవానీ నది, మాయారు అనుసంధానమయ్యే ప్రాంతంలో రూ.10.50 కోట్లతో భవానీసాగర్ డ్యాం నిర్మాణ పనులు 1948లో ప్రారంభమయ్యాయి. నిర్మాణాలకు అవసరమైన యంత్రాలు ఇంగ్లాండ్ నుంచి దిగుమతి చేశారు. ఈ పనులు ఏడేళ్లలో పూర్తికాగా 1955 ఆగస్టు 19న అప్పటి చెన్నై ప్రావిన్స్ ముఖ్యమంత్రి కామరాజర్ డ్యాంను ప్రారంభించారు. ఘనచరిత్ర కలిగిన ఈ డ్యాం 70 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ గంభీరంగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం డ్యాంలో 96.77 అడుగులతో 26.27 టీఎంసీల నీటినిల్వ లున్నాయి.

22 సార్లు నిండిన డ్యాం...

భవానీసాగర్ డ్యాం 1955లో ప్రారంభించగా, 1957లో తొలిసారిగా పూర్తిస్థాయికి చేరింది. ఆ తర్వాత 1958,59,60,61,62 ఇలా ఆరు సార్లు నిండింది. అనంతరం 2005,2006,2007లో కూడా పూర్తిస్థాయికి చేరుకుంది. తదుపరి 2018 నుంచి 2022 వరకు ఐదేళ్లు వరుసగా డ్యాం పూర్తిస్థాయిలో నిండింది. చివరగా 2022 అక్టోబరు 5వ తేది డ్యాం నీటిమట్టం 102 అడుగులుగా నమోదైంది. ఆ తర్వాత డ్యాం పూర్తిస్థాయిలో నిండలేదు. మొత్తంగా డ్యాం నిర్మించిన 70 ఏళ్లలో 22 సార్లు పూర్తిస్థాయిలో నిండింది.

16 మెగావాట్ల విద్యుదుత్పత్తి...

ఈ డ్యాంలో తొమ్మిది రివర్ స్లూయిస్‌లు, మూడు కీల్‌భవాని కెనాల్ స్లూయిస్‌లు, తొమ్మిది మిగులు నీటి 'స్పిల్-వే' స్లూయిస్‌లతో 21 స్లూయిస్‌లున్నాయి. వీటిలో భవానీ నది తూముల్లో విడుదల చేసిన నీటి ద్వారా 8 మెగావాట్లు, కీల్‌భవానీ కాలువ ద్వారా 8 మెగావాట్లు మొత్తం 16 మెగావాట్ల విద్యుదుత్పత్తి జరుగుతోంది.

యజ్ఞోపవీతం.. పరమ పవిత్రం

● గోపురం సంస్థ అధినేత వైవీ హరికృష్ణ





కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆవోపా శ్రావణ పౌర్ణమి పూజలు - గాయత్రీ హోమంలో వైవీ హరికృష్ణ, సంఘ సభ్యులు

ప్యారీస్, ఆగస్టు 19: శ్రావణ మాసం శుక్లపక్ష పౌర్ణమి పర్వదినం సందర్భంగా బ్రహ్మ, విష్ణు, మహేశ్వర స్వరూపమైన జంధ్యం (యజ్ఞోపవీతం) ధరించడం పరమ పవిత్రమని గోపురం కుంకుమ తయారీ సంస్థ అధినేత, అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వైవీ హరికృష్ణ పేర్కొన్నారు. జంధ్యాల పౌర్ణమి, శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని అన్నానగర్‌లోని డా.అంబేడ్కర్ అకాడమీ హాలులో అన్నానగర్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాయత్రి దేవి, వాసవాంబలకు ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఉదయం 7.25 నుంచి 9.30 గంటల వరకు యజ్ఞోపవీత ధారణ జరిగింది. సంఘ కార్యదర్శులు మద్దాలి కాశీ విశ్వనాథం, ఎస్వీ ప్రసాదరావు, ట్రెజరర్ ఎ.శ్రీనివాసులు, వైవీ నిరంజన్, కె.రవికుమార్ సహా సభ్యులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవార్లను సేవించారు.

'ఆవోపా'లో శ్రావణ పౌర్ణమి పూజలు...

స్థానిక జార్జిటౌన్‌లోని కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆర్యవైశ్య ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఆవోపా) తమిళనాడు-తమిళనాడు వాసవి క్లబ్ ఎలైట్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రావణ హోమం నిర్వహించారు. ఆవోపా అధ్యక్షులు టీజీ శ్రీనివాసన్ నేతృత్వంలో ఉదయం 7.15 గంటలకు వాసవి మాత ప్రత్యేక పూజలతో ప్రారంభమైన ఈ వేడుకల్లో ప్రేమ్ ఫార్మా మేనేజింగ్ పార్టనర్ బీఎల్ కుమరవేల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. యజ్ఞోపవీత పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేశారు. అదే విధంగా, వివేకానంద నగర్ భారతీయార్ వీధిలోని నార్త్ మద్రాసు ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి మహల్‌లో ఉదయం 6 గంటలకు ప్రారంభమైన ఆవనిఆవిట్టం పూజల్లో సభ్యులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

విద్యార్థులకు జీఆర్టీ రూ.1.5 కోట్ల స్కాలర్‌షిప్‌లు



స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న జీఆర్‌టీ నిర్వాహకులు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఆభరణాల పరిశ్రమలో ప్రసిద్ధిగాంచిన 'జీఆర్టీ జువెలర్స్' ప్రతిభావంతులైన విద్యార్థులకు రూ.1.5 కోట్ల స్కాలర్‌షిప్‌లు అందించింది. ఇప్పటికే కళాశాలల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ సంవత్సరాల్లో చదువుతున్న 171 మంది అర్హులైన విద్యార్థులకు రూ.80.96 లక్షలు అందించింది. ఇటీవల అశోక్‌నగర్‌లోని మహాలక్ష్మి విద్యాలయంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించింది. ఈ సందర్భంగా జీఆర్టీ ప్రతినిధి మీడియాతో మాట్లాడుతూ.. విద్యా అనేది పురోగతికి పునాది అని, జీఆర్టీ జువెలర్స్ ప్రతిభావంతులైన విద్యార్థుల జీవితాల్లో అర్థవంతమైన మార్పు తీసుకురావడానికి దోహదపడడం గర్వంగా వుందన్నారు. యోగ్యమైన వ్యక్తులకు విజయం సాధించి అవకాశాన్ని అందించడమే తమ లక్ష్యమని, తద్వారా వారు తమ కోసం మెరుగైన భవిష్యత్తును నిర్మించుకుంటారన్నారు.

పాఠశాలల్లో నైట్‌గార్డుల నియామకం

● మంత్రి అన్బిల్ మహేష్

పెరంబూర్, ఆగస్టు 19: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నైట్ గార్డులను త్వరలో నియమించనున్నట్లు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. విల్లుపురం జిల్లా సెంజి సమీపం విల్ల పెట్రాన్ గ్రామంలోని కలైంజర్ కరుణానిధి శతజయంతి వేడుకల సందర్భంగా ప్రజలకు మంత్రి అన్బిల్ మహేష్ సహాయాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల పాఠశాలలకు ప్రాధాన్యం కల్పిస్తూ 3,500లకు పైగా తరగతి గదులు నిర్మించామన్నారు. అలాగే, రూ.1,000 కోట్లతో అదనపు తరగతుల భవనాలు ఏర్పాటుచేయనున్నామని తెలిపారు. ప్రభుత్వ హైయర్ సెకండరీ పాఠశాలల్లో హైటెక్ ల్యాబ్‌లు, రాత్రి పాఠశాల విద్యార్థుల భద్రత కోసం వాచ్‌మెన్‌లు నియమించనున్నామని తెలిపారు. అలాగే, పీజీ టీచర్ల కొరత తీర్చేలా జిల్లాల వారీగా వివరాలు సేకరించి అవసరమైన ప్రాంతాల్లో ఉపాధ్యాయులను నియమించనున్నామని తెలిపారు.



ప్రభుత్వ మహోన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న మంత్రి అన్బిల్ మహేష్



అతిథులను సత్కరిస్తున్న నిర్వాహకులు

క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నతస్థాయికి సోపానం

పెరంబూర్, ఆగస్టు 19: క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నతస్థాయికి సోపానమని నగర నార్త్ జోన్ పోలీసు ఐజీ ఆశ్రా ఖార్గ్ విద్యార్థులకు సూచించారు. వడపళనిలోని ఎస్ఆర్ఎం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ పరిధిలోని ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ (ఎఫ్ఈటీ) క్యాంపస్‌లో సోమవారం మొదటి సంవత్సర విద్యార్థులకు స్వాగత కార్యక్రమం జరిగింది. ఎఫ్ఈటీ డీన్ డా.సీవీ జయకుమార్ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో ఎస్ఆర్ఎం గ్రూప్ అకడమిక్స్ డైరెక్టర్ డా.ఎస్.రామచంద్రన్, వైస్ ఛాన్సలర్ డా.సి.ముత్తమిళ్ సెల్వన్, ప్రొ ఛాన్సలర్ డి.రవి పచ్చముత్తు, ఎస్ఆర్ఎం గ్రూప్ ఇన్‌స్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ హరిణి రవి, తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిరోధం కోసం పరుగు

● సీనియర్ సిటిజన్ల వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న సీనియర్ సిటిజన్లు, నిర్వాహకులు

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): ఎస్ చెన్నై యంగ్ చెన్నై సంస్థ ఆధ్వర్యంలో అన్నానగర్ టవర్ పార్కు ప్రాంతంలో 'ప్లాస్టిక్ నిరోధం కోసం పరుగు' పేరు తో నిర్వహించిన వాకథాన్‌లో సీనియర్ సిటిజన్లు ఆసక్తిగా పాల్గొన్నారు. ప్లాస్టిక్‌ను నిరోధించి పుడమతల్లిని కాపాడాలంటూ నినాదాలు చేస్తూ వృద్ధులు పరుగులు తీశారు. రెండు కిలోమీటర్ల మేర సాగిన ఈ వృద్ధుల పరుగును రోటరీ డిస్ట్రిక్ట్ 3233 గవర్నర్ రొటేరియన్ మహావీర్ బోత్రా ప్రారంభించారు. సౌభాగ్యా సంస్థ సీఈఓ వి.వరదరాజన్, అతుల్య సీనియర్ కేర్ మార్కెటింగ్ డైరెక్టర్ జే కృష్ణ కావ్య తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర రెగ్యులేటరీ అథారిటీ ఛైర్మన్‌గా నియమితులైన మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా సోమవారం ఉదయం చెన్నై సచివాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న దృశ్యం



ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శిగా నియమితులైన ఐఏఎస్ అధికారి కె.లక్ష్మీపతి చెన్నై సచివాలయంలో సీఎం స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్న దృశ్యం



చెన్నై సచివాలయంలో రక్షాబంధన్ సందర్భంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

రైల్వే పథకాలకు నిధులు కేటాయించండి

● కేంద్ర రైల్వే మంత్రికి సీఎం స్టాలిన్ లేఖ



సీఎం స్టాలిన్, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్

చెన్నై, ఆగస్టు 19 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దక్షిణ రైల్వే పథకాలకు నిధుల కేటాయింపులు బాగా తగ్గించిన నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన రైల్వే ప్రాజెక్టులకు త్వరితగతిన నిధులు కేటాయించాలని రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌కు ముఖ్యమంత్రి స్టాలిన్ లేఖ రాశారు. రాష్ట్రంలో కొత్త రైలు మార్గాలు, జంట రైలు మార్గాల నిర్మాణం, ప్రయాణికులకు మెరుగైన సదుపాయాలకు సంబంధిన పథకాలకు అవసరమైన నిధులు కేటాయిస్తున్నట్లు భరోసా కల్పించాలని కోరారు. బడ్జెట్‌లో రైల్వే పథకాలకు చాలినంత నిధులు కేటాయించకపోవడంతో ప్రస్తుతం అమలు చేస్తున్న రైల్వే పథకాల పనులు ఆగిపోయే ప్రమాదం ఉందని స్టాలిన్ గుర్తు చేశారు. ఇకనైనా రాష్ట్రానికి సంబంధించిన రైల్వే పథకాలకు భారీగా నిధులు కేటాయించాలని ఆ లేఖలో కేంద్ర మంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.